నేడు అమ్మవారికి గాజులతో అలంకరణ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్–2లోని నల్ల పోచమ్మ ఆలయంలోని అమ్మవారిని శ్రావణ శుక్రవారం సందర్భంగా గాజులతో మంగళగౌరీగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా బోనాల పండుగ సందర్భంగా అమ్మవారికి భక్తులు పోసిన ఒడి బియ్యంతో అన్నదానం, అమ్మవారి చీరల వేలం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

పార్ధీబస్తీలో కార్పొరేటర్ పర్యటన



బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని పార్ధీబస్తీ (పిట్టలబస్తీ)లో కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అధికారులతో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ, రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జల మండలి అధికారులతో మాట్లాడి భూగర్భ డ్రైనేజీ నూతన లైన్ వేసిన అనంతరం రోడ్డు వేస్తామని హామీనిచ్చారు. అలాగే జిమ్‌ను పరిశీలించి, మరిన్ని జిమ్ పరికరాలు అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈ రాధాకృష్ణ, జలమండలి, శానిటరీ సూపర్‌వైజర్ సాయి, స్వామి, నాయకులు బబ్లు, జయమ్మ, గణేశ్, రాజేశ్వర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ పేరిట' మొక్క నాటాలి



మొక్క నాటుతున్న గీతారెడ్డి తదితరులు

ఆల్విన్‌కాలనీ: ప్రతిఒక్కరూ అమ్మ పేరిట ఒక మొక్క నాటి, సంరక్షించాలని రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా సెక్రటరీ గీతారెడ్డి పిలుపునిచ్చారు. ఆల్విన్‌కాలనీలో డివిజన్ అధ్యక్షుడు ఎత్తరి రమేశ్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలు, బస్తీలను వాతావరణ కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు వనాల పెంపు ఎంతో అవసరమన్నారు. అదేవిధంగా పలు కూడళ్ల వద్ద మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతి, కుమార్ చారి, నరేందర్‌రెడ్డి, రామరాజు, కుమారీయాదవ్, స్రవంతి, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబిహాగౌసుద్దీన్

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ అల్లాపూర్ మస్జీద్ నుంచి వర్షపు నీరు వెళ్లేందుకు రూ. 1.28 కోట్ల వ్యయంతో చేపట్టిన స్ట్రాం వాటర్ డ్రైవ్ పనులను కార్పొరేటర్ సబిహాగౌసుద్దీన్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, డివిజన్ కో–ఆర్డినేటర్ వీరారెడ్డి, అబ్దుల్ రహీం, సయ్యద్ నసీర్, ఇస్మాయిల్, ఛాంద్‌పాషా, ఉస్మాన్, సయ్యద్ కరీం, నూర్‌ఖాన్, మోయిజ్, జిలానీ, దస్తగిరి, ఖదీర్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఏసీఈ-2025 అవార్డు అందుకున్న ఓయూ వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ ప్రొ.కుమార్ ఏసీఈ–2025 అవార్డును అందుకున్నారు. గురువారం గురుగ్రామ్‌లో జరిగిన ఆల్ ఇండియా సర్క్యులర్ ఎకానమి నిర్వహించిన కార్యక్రమంలో ఉన్నత విద్యలో ప్రమాణాలకుగాను అవార్డు లభించినట్లు ఓయూ అధికారులు తెలిపారు. ప్రతి రోజు 2 టన్నుల వ్యర్థాలతో బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి కాలుష్య రహితంగా పచ్చదనాన్ని పెంపొందిస్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సనత్‌నగర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బేగంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. బాలంరాయి క్లాసిక్‌గార్డెన్ సమీపంలో ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పెట్రోలింగ్ సిబ్బంది 108 సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని సదరు వ్యక్తిని పరిశీలించగా మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. మృతుడి వివరాలు లభ్యం కాలేదు. దీంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

బాబోయ్..
ఇక్కడ బతకలేం..!

జీడిమెట్ల పారిశ్రామికప్రాంతంలో 1200 పైచిలుకు ఫ్యాక్టరీలు

- కాలుష్యంతో సతమతం అవుతున్న ప్రజలు
- తాగునీరు, పీల్చే గాలి రెండూ కలుషితమే
- వీలైనంత త్వరగా వాటిని తరలించాలని స్థానికుల వినతి



నాలాలో పారుతున్న రసాయనాలు

జీడిమెట్ల: మనిషి ప్రశాంత జీవనానికి స్వచ్ఛమైన గాలి, శుద్ధజలం అవసరం. కానీ జీడిమెట్ల పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ రెండు లేకుండా పోయాయి. సుమారు 3 దశాబ్దాల క్రితం జీడిమెట్ల పారిశ్రామికప్రాంతంలో పరిశ్రమలు స్థాపించారు. ప్రస్తుతం అవి సుమారు 1200పై చిలుకు వరకు చేరాయి. వీటి చుట్టూ దాదాపు 20 కాలనీలు ఉండగా లక్షకు పై చిలుకు ప్రజలు నివసిస్తున్నారు. అయితే వీరంతా అటు పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య కారకాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యాక్టరీల నుంచి వెలువడే రసాయనాలు ఇక్కడి భూమిలో ఇంకిపోవడంతో 10 కిలోమీటర్ల రేడియస్‌లోని జీడిమెట్ల చుట్టు పక్కల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. ఇక్కడి బోర్ల నుంచి నిత్యం రసాయనాలతో కూడిన నీరు బయటకు వస్తోందని, అవి తాగేందుకు, కనీస అవసరాలకు కూడా పనికి రాకుండా ఉంటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరికి ప్రభుత్వం సరఫరా చేసే నీరే దిక్కవుతోంది. మరో వైపు పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం వలన కలుషితం అయిన గాలి పీల్చుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.



జీడిమెట్లలో ఓ పరిశ్రమ నుంచి వెలువడుతున్న పొగ

కాలుష్య కారక పరిశ్రమల తరలింపు ఎప్పుడో..?

గత ఆరేళ్లుగా జనావాసాల మధ్యలోని కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఓఆర్‌ఆర్ ఆవలి వైపు తరలించాలని ప్రభుత్వం నుంచి జీఓలు వెలువడ్డాయి. కానీ ఇది అచరణలోకి మాత్రం రావడం లేదు. దీంతో చాలావరకు పారిశ్రామిక చుట్టు పక్కల ప్రాంతంలోని ప్రజలు రింగురోడ్డు ఆవలి వైపు ఇళ్లు కొనుక్కుంనేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వారం క్రితం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. జనావాసాల మధ్య కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను ఓఆర్‌ఆర్ ఆవలి వైపు తరలించాలని అందుకు సంబంధించిన పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు పట్టించుకుని వీలైనంత త్వరగా కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను జీడిమెట్ల నుంచి తరలించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

రోగాల బారిన పడుతున్నాం..



20 ఏళ్లుగా జీడిమెట్ల ప్రాంతంలోనే నివసిస్తున్నాం. రోజురోజుకూ ఇక్కడ కాలుష్యం పెరుగుతుందే కానీ తగ్గడం లేదు. కాలుష్యం వలన చిన్న వయస్సులోనే ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను ఇక్కడ నుండి తరలిస్తే ఎంతో మేలు చేసిన వారవుతారు.

– వెంకటరెడ్డి, అపురూపాకాలనీ వాసి

చాలా ఇబ్బందులు పడుతున్నాం..



16 ఏళ్లుగా సుభాష్‌నగర్‌లో నివాసిస్తున్నాం. ఇక్కడి ఫ్యాక్టరీల వల్ల గాలి కలుషితం అవుతోంది. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇక్కడి నుంచి మరో చోటికి వెళ్దామంటే ఇంటిని విడిచి వెళ్లలేకపోతున్నాం. గంపలబస్తీలోని రీసైక్లింగ్ యూనిట్ల వలన తీవ్రమైన కాలుష్యం వెలువడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు పట్టించుకుని కాలుష్య కారక పరిశ్రమలను ఇక్కడి నుంచి తరలించాలి.

– గోదావరి, సుభాష్‌నగర్

రెడ్‌జోన్ పరిశ్రమల నివేదికను ప్రభుత్వానికి పంపించాం..



గతంలో ప్రభుత్వం ఇచ్చిన జీఓ ప్రకారం ఇండస్ట్రియల్ ప్రాంతాల్లోని రెడ్‌జోన్ పరిశ్రమలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాం. ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఓఆర్‌ఆర్ ఆవలి వైపు ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేసి ఇక్కడి కాలుష్యకారక పరిశ్రమలను తరలించాల్సి ఉంటుంది. సీఎం రేవంత్‌రెడ్డి కూడా త్వరగా తరలించే ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈమేరకు చర్యలు తీసుకుంటాం.

– రాజేందర్, పీసీబీ అధికారి మేడ్చల్ జిల్లా

పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కిట్ల పంపిణీ



కిట్లు అందుకున్న కార్మికులతో కార్పొరేటర్ నర్సింహయాదవ్

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో బాలాజీనగర్ కార్పొరేటర్ పగడాల శిరీష జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు కిట్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగర ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుతూ, నగరాన్ని శుభ్రంగా ఉంచుతున్న కార్మికుల శ్రమ వెలకట్టలేనిదన్నారు. రక్షణ పరికరాలు ఉపయోగిస్తూ విధులు నిర్వహించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఏ చిరంజీవి, సాయి, నాయకులు భాస్కర్, కార్మికులు పాల్గొన్నారు.

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్మికులకు..

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ తన నివాసంలో డివిజన్‌లోని పారిశుద్ధ్య కార్మికులకు గురువారం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారులు, పరిసరాలు శుభ్రంగా ఉన్నాయంటే కార్మికుల పనితనమేనని అన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎస్‌ఆర్‌పీ రాజు, ఎస్‌ఎఫ్‌ఏలు నవీన్, శ్రీనివాస్‌గౌడ్, మల్లేశరాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శిరీష

కేపీహెచ్‌బీలో చైన్ స్నాచింగ్

కేపీహెచ్‌బీకాలనీ: వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ 3–ఫేజ్‌లోని భువన విజయం గ్రౌండ్స్ వద్ద నివాసం ఉండే చింత శ్యామల (70) గురువారం ఉదయం పాల ప్యాకెట్ కోసం షాపునకు వెళ్లింది. కారులోని ఇద్దరు వ్యక్తులు వచ్చి పేపర్ చూపిస్తూ అడ్రస్ చెప్పాలని హిందీలో అడిగాడు. దీంతో తనకు తెలియదని శ్యామల ముందుకు వెళ్లింది. కారులో వెనకాలే వచ్చిన ఆ వ్యక్తి మళ్లీ శ్యామల వద్దకు వచ్చి ఆమెను కిందకు తోసి మెడలోని బంగారు గొలుసును తీసుకునేందుకు యత్నించగా ప్రతిఘటించింది. దీంతో గొలుసు రెండు ముక్కలుగా తెగిపోగా ఒక ముక్క తీసుకుని దుండగుడు కారు ఎక్కి వెళ్లిపోయాడు. దీంతో బాధితురాలు కేపీహెచ్‌బీ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



రేఖ కోల్

మియాపూర్: మహిళ అదృశ్యమైన ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మియాపూర్ న్యూ హాఫీజ్‌పేటలోని మార్తాండ నగర్ కాలనీలో రాజారామ్ కుమార్, రేఖ కోల్(20) 15 ఏళ్లుగా నివాసముంటున్నారు. గత నెల 29న రాజారామ్ కిరాణ దుకాణానికి వెళ్లాడు. 9 గంటల సమయంలో భార్య రేఖ కోల్‌కు ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. వెంటనే ఇంటికి వచ్చిచూడగా ఇంటిదగ్గర భార్య రేఖకోల్ కనిపించలేదు. ఇంటికి తాళం వేసి ఉంది. రాత్రి అయినా భార్య ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో ఎంతవెతికినా ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన రాజారామ్ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా చూడాలి



ఎస్సీ బస్తీలో మాట్లాడుతున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్, అధికారులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ ఈఈ గోవర్ధన్ గౌడ్డీఈ ఆశాతో కలిసి హస్మత్‌పేట ఎస్సీ బస్తీ, మానస సరోవర్ హైట్స్ వెనుక ఉన్న హనుమాన్‌నగర్‌లో గురువారం పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షం నీరు నిలిచి బురదమయంగా మారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేటర్ స్పందిస్తూ తక్షణమే బాక్స్ డ్రైనేజీ నిర్మించి సమస్య పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈఈ గోవర్ధన్ మాట్లాడుతూ.. డ్రైనేజీల్లోని మట్టిని ఎప్పటికప్పుడు తొలగించి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ నాయకులు గడ్డం నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, బుర్రి యాదగిరి, జవాన్ రాజు, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొ.అన్సారీకి న్యాయం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.అన్సారీకి న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట సమావేశమైన 13 విద్యార్థి సంఘాల నాయకులు పింఛన్, రిటైర్డ్ బెనిఫిట్స్ కోసం ప్రొ.అన్సారీ చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలిపారు. 2023లో ఉద్యోగ విరమణ చేసిన ప్రొ.అన్సారీని పింఛన్ కోసం కార్యాలయం చుట్టూ తిప్పించుకోవడం అన్యాయమన్నారు. అన్సారీకి పింఛన్ చెల్లించాలని మైనార్టీ కమిషన్ ఇచ్చిన రిపోర్టును కూడా నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ, బీఆర్‌ఎస్‌వీ, టీజీఎస్‌యూ, ఎస్‌ఏస్‌యూ, ఎస్‌టీఎస్‌ఏ, ఏఐఓబీసీఎస్‌ఏ, ఎస్‌ఎస్‌ఎఫ్, ఏఎస్‌ఏ,ఐఎస్‌ఏ, ఎంఎస్‌ఓ తదితర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌నగర్ పీఎస్ పరిధిలో అత్యధిక కేసులు నమోదు

అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో జులై మాసంలో అత్యధిక కేసులు నమోదయ్యాయి. స్టేషన్ పరిధి తగ్గిపోయినప్పటికి నమోదు అవుతున్న కేసుల సంఖ్య మాత్రం పెరిగిపోతుంది. 2025 జులై 31 వరకు 120 కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. జులై నెలలో వెస్టుజోన్ పరిధిలోనే అత్యధిక కేసులు నమోదు అయిన పోలీస్‌స్టేషన్‌గా ఎస్‌ఆర్‌నగర్ మొదటి స్థానంలో నిలిచింది.గతంలో మధురానగర్, బోరబండ ప్రాంతాలు ఎస్‌ఆర్‌నగర్ స్టేషన్ పరిధిలో ఉన్న సమయంలో ఒక్క నెల వ్యవధిలో 31 కేసులు నమోదు చేసిన రికార్డు ఎస్‌ఆర్‌నగర్‌కు ఉంది.కాగా జులై 1 ,2వ తేదీన జరిగిన బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణ వేడుకల సందర్భంగా వివిధ సంఘటనలకు సంబంధించి 19 కేసులు నమోదు కావడం విశేషం.



చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే చర్యలు



అల్లాపూర్‌లో వివరాలు తెలుసుకుంటున్న డీసీపీ సురేశ్‌కుమార్

మోతీనగర్: చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని బాలానగర్ జోన్ డీసీపీ కే సురేశ్‌కుమార్ హెచ్చరించారు. అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో స్థానిక సీఐ సామల వెంకటరెడ్డితో కలిసి రాజీవ్‌గాంధీనగర్‌లో బుధవారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 32 బృందాలు ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వాహనాల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. 82 వాహనాలకు చలాన్లు పెండింగ్‌లో ఉండడంతో అక్కడిక్కడే ట్రాఫిక్ పోలీసులు వసూలు చేశారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. ఇల్లు అద్దెకు ఇచ్చేటప్పుడు వారి పూర్తి సమాచారాన్ని తీసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

యంత్రం ప్రారంభం



యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఉప కమిషనర్ సేవా ఇస్లావత్

కేపీహెచ్‌బీకాలనీ: మూసాపేట సర్కిల్ కేపీహెచ్‌బీ డివిజన్ వసంత్‌నగర్‌కాలనీ సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన వుడ్ చిప్పర్ యంత్రాన్ని సర్కిల్ ఉప కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు పక్కన చెట్ల కొమ్మలు అస్తవ్యస్తంగా ఉండకుండా వాటిని తొలగించి పరిసరాలు శుభ్రంగా ఉంచేందుకు ఈ యంత్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ యంత్రంతో తరిగిన చెట్ల కొమ్మలు మళ్లీ కంపోస్ట్ ఎరువులుగా ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు యూబీడీ సర్కిల్ మేనేజర్ విజయరాణి, విజయశ్రీ, అసోసియేషన్ సభ్యులు యర్రా నాగేశ్వరరావు, కృష్ణమూర్తి, నరసయ్య, వర్మ, రాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పాదయాత్రకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



పాదయాత్రకు తరలివెళ్లిన బండి రమేశ్



పాదయాత్రలో సప్పిడి భాస్కర్ తదితరులు

మూసాపేట: టీపీసీసీ ఆధ్వర్యంలో ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ గురువారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పరిగి నియోజకవర్గంలో నిర్వహించిన పాదయాత్రకు ఆంజనేయనగర్‌లోని కాంగ్రెస్ కార్యాలయం నుంచి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్ ఆధ్వర్యంలో శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

పాదయాత్రలో నాయకులు..

టీపీసీసీ కార్మిక నాయకుడు సప్పిడి భాస్కర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు టీపీసీసీ లేబర్ సెల్ ఇన్‌చార్జి సంఘిశెట్టి జగదీశ్వర్ రావుతో కలిసి పాల్గొన్నారు.

ఆదర్శంగా సీనియర్ సిటిజన్స్



సీనియర్ సిటిజన్ దంపతులను సన్మానించిన కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకుంటున్న సీనియర్ సిటిజన్స్ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. పీవీ ఎన్‌క్లేవ్‌లోని స్నేహ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు, 75 ఏళ్ల పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న వారిని శాలువాలతో సన్మానించి కేక్ కట్ చేసి అందించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ బ్రహ్మయ్య, బి. నారాయణ, సుధాకర్, సూర్యప్రకాశ్, శ్యాంసుందర్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి కాలువ పనులను వేగవంతం చేయాలి



వరదనీటి కాలువ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: వరదనీటి కాలువ పనులను వేగవంతం చేయాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధికారులకు ఆదేశించారు. డివిజన్ పరిధిలోని గాయత్రి ఎన్‌క్లేవ్ నుంచి బొల్లారం ప్రధాన రోడ్డు వరకు రూ.కోటి 50లక్షలతో చేపట్టిన వరదనీటి కాలువ పనులను కార్పొరేటర్ శ్రీకాంత్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని వరదనీటి కాలువ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సునిత, కాలనీ వాసులు తదితరులున్నారు.

మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలి



అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, బచ్‌పన్ బచావో ఆందోళన్ ప్రతినిధులు

శేరిలింగంపల్లి: మానవ అక్రమ రవాణాను సమూలంగా నిర్మూలించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని లింగంపల్లి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీ. బాషా పిలుపునిచ్చారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, గవర్నమెంట్ రైల్వే పోలీసులు, బచ్‌పన్ బచావో ఆందోళన్ సంయుక్తాధ్వర్యంలో లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ..మానవ అక్రమ రవాణా అనేది రోజురోజుకూ పెరుగుతుందన్నారు. మహిళలు, చిన్నారులే లక్ష్యంగా అక్రమ రవాణాదారులు ఉంటారని, ప్రయాణించే సమయంలో వారిని ఒంటరి వదిలిపెట్టవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో బచ్‌పన్ బచావో ఆందోళన్ ప్రతినిధులు నరేష్, ఆశ్రీత, పర్వతాలు, ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ ఎన్. ఆనంద్, జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌వీ రీజియన్ స్థాయి పోటీల్లో హవేరీ క్లస్టర్ విజేత

రాయదుర్గం: జవహర్‌నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ముగిసింది. ఈ పోటీల్లో నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ స్థాయి విజేతగా హవేరీ క్లస్టర్ నిలిచింది. మూడు రోజులపాటు గోపన్‌పల్లిలోని పీఎంశ్రీ జవహర్‌నవోదయ విద్యాలయ రంగారెడ్డి జిల్లా క్యాంపస్‌లో ఈ వాలీబాల్ రీజియన్ స్థాయి పోటీలను నిర్వహించారు. దక్షిణ భారతదేశానికి చెందిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని జవహర్ నవోదయ విద్యాలయలకు చెందిన 8 క్లస్టర్లు అండర్–14, 17, 19 విభాగాల్లో బాలబాలికల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఇందులో ఓవరాల్ చాంపియన్‌గా హవేరీ క్లస్టర్ నిలిచింది. ముగింపు సమావేశంలో నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ అభిజిత్ బెహరా మాట్లాడుతూ..జవహర్ నవోదయ విద్యాలయాల్లో చదువుతోపాటు విద్యార్థులకు క్రీడలు, ఇతర రంగాల్లో రాణించేలా, ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ చక్రపాణి, నేషనల్ లీడర్‌షిప్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ రీజియన్ ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్ నాగభూషణం, విద్యాలయ రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపాల్ విజయభాస్కర్, ఉపాధ్యాయులు, కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.